## క్లుప్తంగా

### గడప గడపకు వాయిదా

పరవాడ: మండలంలోని కన్నూరు శివారు మడకపాలెంలో బుధ, గురువారాల్లో నిర్వహించాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు గమనించాలని శ్రీనివాసరావు కోరారు. తదుపరి తేదీలను ప్రకటిస్తామన్నారు.

### సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు


సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

### నాణ్యతలో రాజీపడొద్దు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పురుషోత్తపురంలోని మరిడిమాంబకాలనీలో రూ.15.70 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులను మంగళవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. నాణ్యతగా పనులు జరగాలని, క్రమ పద్ధతిలో చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి కమ్యూనిటీ హాలును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో చందుయాద్, జొన్నాడ సాయికృష్ణ, గోకి వాడ బుజ్జి, విజయేంద్ర కృష్ణ పాల్గొన్నారు.

### 180 మందికి వైద్య పరీక్షలు


వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి సౌజన్యంతో సర్పంచ్ బండారు మంగ,ఎంపీపీ బోకం సూర్యకుమారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామానికి చెందిన సుమారు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. 20 మందికి శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.వీరిని బుధవారం ఆస్పత్రికి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బండారు మంగ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు,బండారు శ్రీను, వైద్య సిబ్బంది డాక్టర్‌లు మౌనిక,సుప్రియ,పృథ్వీ,హర్షిని తదితరులు పాల్గొన్నారు.

### మలేరియాపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

సింహాచలం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మంగళవారం పెందుర్తి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మలేరియా లక్షణాలు, నివారణ, దోమల వ్యాప్తిని అరికట్టడం, నియంత్రణ పద్ధతులు, ఫ్రైడే డ్రైడే పాటించడం వల్ల ఉపయోగాలను వివరించారు. అలాగే గ్రామాల్లో వీవోలు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో స్వర్ణలత, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ, సీడీపీవో నీలవేణి, ఎంహెచ్ఈవో కొండలరావు, వెలుగు సిబ్బంది, సీసీలు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎం రమణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాడు వైఎస్సార్.. నేడు జగనన్న


లంకెలపాలెంలో నిర్మించిన యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి రజని, ఎంపీ సత్యవతి

- ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధికి చిరునామాగా మార్చారు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని
- లంకెలపాలెం, నమ్మిదొడ్డి ప్రాంతాల్లో యూపీహెచ్‌సీలు ప్రారంభం

అగనంపూడి: రాష్ట్రంలో ఆస్పత్రులు అభివృద్ధికి చిరునామాగా మారాయంటే ఆ ఘనత అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, నేడు పేదల పెన్నిధి జగనన్నకే చెందుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని అన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో సీఎం జగన్ తండ్రికి తగ్గ తనయుడన్నారు. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెంలో రూ.కోటి 23 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హెల్త్ సెంటర్‌లో నిరంతరం డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఓపీ సేవలు అందిస్తారని, 172 రకాల మందులు లభ్యమవుతాయని తెలిపారు. ప్రతీ ఆస్పత్రిని ఆధునీకరించడంతో పాటు స్థాయిని రెట్టింపు చేసుకుంటూ వెళ్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక చంద్రబాబు నాయుడు విషం చిమ్ముతున్నారన్నారు. అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ లంకెలపాలెం వాసుల చిరకాల స్వప్నం నేటికి నెరవేరిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో వైద్యసేవలను ప్రజలందరికీ అందుబాటులో తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని, జాతీయ స్థాయిలో వైద్య రంగంలో అత్యుత్తమ సేవలకుగాను అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ, వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, పరవాడ ఎంపీపీ పైలా వెంకట పద్మాలక్ష్మి, 79వ వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు కింతాడ ఈశ్వరరావు, సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి, యలమర్తి వెంకటరావు పాల్గొన్నారు.

**ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు**

పెదగంట్యాడ: వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి విడదల రజిని అన్నారు. 77వ వార్డు నమ్మిదొడ్డిలో రూ.101.50లక్షలతో నిర్మించిన పది పడకల డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను అనకాపల్లి ఎంపీ బి.సత్యవతితో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో రాష్ట్రంలో 528 యూపీహెచ్‌సీ కేంద్రాలను నాడు–నేడు పథకం కింద రూ.399 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. 10,032 పీహెచ్‌సీలు నిర్మిస్తున్నామన్నారు. ప్రతి పేద వాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. ప్రతీ 30 వేల జనాభాకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాడు–నేడు పథకం కింద పాతబడిన ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా నమ్మిదొడ్డి గ్రామంలో 10 పడకల ఆస్పత్రిని అన్ని రకాల సదుపాయాలతో తీర్చిదిద్దామన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో సుమారు 172 రకాల మందులు, ఓపీ సేవలు, 63 రకాల రక్త పరీక్షలు, మాతా శిశు సేవలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ వంటి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. సంజీవని, ఆయుష్మాన్–భారత్, టెలీ మెడిసిన్ వంటి సేవలు ఉంటాయని, మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఏడుగురు సిబ్బంది సేవలందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జెడ్సీ పి.సింహాచలం, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

## స్ఫూర్తిప్రదాత ఆదిశంకరాచార్య


వాడచీపురుపల్లిలో ఆది శంకరాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


పరవాడలో ఆది శంకరాచార్య జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

పరవాడ: కుల మతాలకు అతీతంగా హిందూ ధర్మాన్ని ఏకతాటిపైకి తెచ్చిన జగద్గురు ఆదిశంకరాచార్య స్ఫూర్తి ప్రదాతఅని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు అన్నారు. పరవాడ రామాలయంలో ఆది శంకరాచార్య జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. శంకరాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ఒక తాటిపై నిలబెట్టిన శంకరాచార్యులు భారత దేశంలో జన్మించడం గర్వకారణమన్నారు. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని నిలబెట్టడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాతృమూర్తులు రెడ్డి రమణమ్మ, భద్రావతి, కె.లక్ష్మి, పార్వతి, నూకాలమ్మ పాల్గొన్నారు.

- వాడచీపురుపల్లి రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదిశంకరాచార్య చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కూండ్రపు కృష్ణంనాయుడు, సంఘ అనకాపల్లి జిల్లా మహిళా కార్యదర్శి ఉమామహేశ్వరి, ప్రతినిధులు ఎం.నాయుడు, సన్నిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

**కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి**


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: ఔషధ పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణకు యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్‌లో 'అగ్నిమాపక నివారణ చర్యలు – ప్రథమ చికిత్స' పై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను మంగళవారం కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణ, ప్రథమ చికిత్సపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఉద్యోగులు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెలకువలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి. లాల్ కృష్ణ, అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి లక్ష్మణస్వామి, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ కార్యదర్శి జె.సుబ్బారావు పాల్గొన్నారు.

### 'ధూళి అరికట్టడానికి చర్యలు చేపట్టాలి'

పరవాడ: హిందూజా పవర్ ప్లాంటుకు రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీలు విడుదల చేస్తున్న ధూళిని అరికట్టడానికి చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. లంకెలపాలెం, పరవాడ గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. అధిక లోడ్లతో ప్రయాణిస్తున్న లారీల వల్ల రోడ్లు దెబ్బతిని ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు.

### నాగుపాము కలకలం


నాగుపామును పట్టుకున్న రామకృష్ణ

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం శివారు కొత్తరోడ్డు జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి నాగుపాము హల్‌చల్ చేసింది. పోతల వారి ఇళ్ల వద్ద ధాన్యం పోసుకునే గాదిలో పాము బుసలు కొడుతూ కనిపించింది. దీనితో చుట్టు పక్కల వారంతా ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబర్ బోకం రామకృష్ణ నాగుపామును చాకచక్యంగా గాదిలోకి దిగి పట్టుకున్నారు. శివారు ప్రాంతంలో విడిచి పెట్టారు.

# రోడ్లు ఇలా.. రాకపోకలెలా!


రాళ్లు తేలిన మెట్టపాలెం రహదారి


ధ్వంసమైన వెంకటాపురం రహదారి

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు మెట్టపాలెం, వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారులు అధ్వానంగా మారాయి.దీంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రహదారి పొడవునా ఎక్కడికక్కడ గుంతలు కావడంతో రైతులు, విద్యార్థులు, కార్మికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఆరేళ్ల నుంచి ఈ రెండు రహదారులను అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్ల పరిస్థితి నానాటికీ అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు శిథిలం కావడంతో రాళ్లు తేలిపోయి నడవడానికి కూడా పనికి రాకుండా ఉన్నాయి. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకొన్నా ఫలితం శూన్యమని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ


బహిరంగ సభ స్థలం వద్ద అధికారులతో చర్చిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

ఉక్కునగరం: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటగా ఆయన ఈ స్టేషన్‌కు వచ్చారు. ఏడీసీపీ గంగాధర్, సౌత్ డీసీపీ ఆనందరెడ్డి, ఏసీపీ టి.త్రినాథరావుతో వచ్చి ఆయన స్టేషన్ పరిసరాలను సందర్శించారు. అక్కడున్న చోరీ సొత్తు గురించి ఆరా తీసిన ఆయన, సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య, వారి సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య, టౌన్‌షిప్‌లో క్వార్టర్లు అందులో ఉంటున్న నివాసుల గురించి ఆరా తీశారు. అంతకు ముందు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని ఆయన సందర్శించారు. అక్కడి ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సభ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### చలివేంద్రం ఏర్పాటు


వాడచీపురుపల్లి సచివాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ అప్పలరాజు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామ సచివాలయ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, ఉప సర్పంచ్ కె.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష ఆదరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

**ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్**

సింహాచలం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నియోజకవర్గంలో ఉత్సాహంగా జరుగుతోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి గృహాలను సందర్శించిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే రాంపురంలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రజల నుంచి వచ్చిన నినాదమని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పార్టీలు, కులాలు, ప్రాంతాలు, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎలాంటి లంచం ఇవ్వకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలం చేకూరేలా చేశారన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 52వేల గృహాలను గృహసారథులు, కన్వీనర్లు సందర్శించారని చెప్పారు. సుమారు 18వేల ఫోన్ మిస్డ్ కాల్స్ ఇచ్చినట్టు తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, మండల పార్టీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్క కనకరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, పార్టీ నాయకుడు గొర్లె రామునాయుడు, సత్తిబాబు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ ఆదిరెడ్డి మురళి పాల్గొన్నారు.

## నిర్ణీత కాల వ్యవధిలో భూ సర్వే పూర్తి చేయాలి


అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : భూ సర్వే నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లను జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. మీసేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఏపీఐఐసీ, ఎన్‌హెచ్–16, రైల్వే భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

ఈనెల 26 నుంచి మే 25 వరకు నెల రోజుల పాటు మండల తహసీల్దార్ కార్యాలయంలో సింగిల్ విండో సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు భూపట్టాలకు సంబంధించి సవరణలు చేసుకోవచ్చన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే విజయ్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, ఎస్‌డీసీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ కళాశాలల్లో ముందస్తు ప్రవేశాలపై చర్యలు'


ఆర్ఐవోకు వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు


మద్దిలపాలెం: నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రవేశాలు చేపడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఠాపురం కాలనీలోని ఆర్ఐవో ఉమారాణిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ప్రవేశాల రుసుం రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తయిన తర్వాత వేసవి సెలవులు ఇవ్వకుండా ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కార్పొరేట్ కళాశాలలపై దృష్టి సారించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, నాయకులు ఆడారి మనోహర్, బోర కిరణ్ పాల్గొన్నారు.

## 'కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిద్దాం '


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ప్రచార భేరీలో భాగంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అయోధ్యరామ్ మాట్లాడుతూ 2021 జనవరి 27వ తేదీన కేంద్రప్రభుత్వం ప్రకటించిన 100 శాతం వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా, 800 రోజులుగా రిలే నిరాహార దీక్షలతో ప్రతిఘటిస్తున్నా పట్టించుకోకుండా, స్టీల్‌ప్లాంట్ అమ్మకానికే కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ బుధవారం జరిగే భారీ బహిరంగ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రసంగిస్తారని తెలిపారు. ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల పార్టీలు చేపట్టిన ప్రజా ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ, సీఐటీయూ నాయకుడు వి.ప్రసాద్, సీపీఐ నాయకులు తాండ్ర కనకరాజు, వి.ప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ జేఏసీ (అమరావతి) నాయకులు

మహారాణిపేట : కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంత్సరాలుగా రెగ్యులర్ కాకుండా ఉన్నారని ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం సంఘాల కార్యాచరణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌జీవో హోంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, సిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, అమరావతి కో చైర్మన్లు ఎ. శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకుడు వి. వీరబ్రహ్మం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.